క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కలువాయి(సైదాపురం): మండల కేంద్రంలో శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 33 కేవీ లైన్ వెంబడి చెట్లు తొలగించేందుకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు కలువాయి విద్యుత్‌శాఖ ఏఈ జయకుమర్ తెలిపారు.

రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు హర్షిత



ఓజిలి: మండలంలోని కురుగొండ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న ముడి హర్షిత రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికై నట్లు హెచ్‌ఎం వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. ఈ నెల 16న నెల్లూరులో జరిగిన అండర్ 19 బాక్సింగ్ పోటీల్లో జిల్లా స్థాయిలో గెలుపొంది రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఈ నెల 23న మచిలీపట్నంలో నిర్వహించే రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొంటుందన్నారు.

మేకల పెంపకంలో సస్యరక్షణ చర్యలు

వెంకటగిరి రూరల్: పాడి రైతులు గొర్రెలు, మేకల పెంపకంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని పశుసంవర్ధక శాఖ ఏడీ శ్రీహరి పేర్కొన్నారు. పట్టణంలోని కృషివిజ్ఞాన కేంద్రంలో గురువారం మేకలు, గొర్రెల సంరక్షణపై గురువారం పాడి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఖనిజ లవణ మిశ్రమాలను రైతులకు పంపిణీ చేశారు.

ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక



క్యాడెట్ల ఎంపిక నిర్వహిస్తున్న కల్నల్ అరుణ్‌కుమార్

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో శుక్రవారం బీటెక్ ఫస్టియర్ విద్యార్థులు ఎన్‌సీసీలో చేరేందుకు ఎంపికలు నిర్వహించారు. కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ రకాల పరీక్షలు చేశారు. 340 మంది విద్యార్థులు పోటీపడగా వారిలో 35 మందిని ఎన్‌సీసీ శిక్షణకు ఎంపిక చేసినట్లు తెలిపారు.

మత్స్యకారులకు అవగాహన

కోట: మండలంలోని తీరప్రాంత గ్రామం గోవిందపల్లిపాళెంలో శుక్రవారం వాకాడు మెరైన్ పోలీస్ ఆధ్వర్యంలో మత్స్యకారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మెరైన్ సీఐ వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ సముద్రంలో వేటకు వెళ్లే సమయంలో మత్స్యకారులు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. తుపాన్లు, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కోవడంలో వారికి సూచనలు, సలహాలు అందజేశారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ జయజయరావు, ఎంపీడీఓ దిలీప్‌కుమార్, ఎస్‌ఐలు పవన్‌కుమార్, శివసొమ్య, ఎఫ్‌డీఓ రెడ్యానాయక్ పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్ ప్రారంభం



ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న కమాండెంట్ ప్రసాద్

వెంకటగిరి రూరల్: మండలంలోని వల్లివేడు సమీపంలో ఉన్న 9వ బెటాలియన్‌లో శ్రీ మాతృదేవి విశ్వశాంతి ఆశ్రమ ట్రస్టు పెనుశిల క్షేత్రం శ్రీ విజయేశ్వరి దేవి అమ్మవారి ఆశీసులతో ఏర్పాటు చేసిన అమ్మ శ్రీ కరుణామయి మినరల్ వాటర్ ప్లాంట్‌ను కమాండెంట్ ఈఎస్ సాయి ప్రసాద్ ప్రారంభించారు.

మహిళల ఆరోగ్య సంరక్షణే లక్ష్యం

రాపూరు: స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు రోగులను పరీక్షించి మందులు అందించారు. కేంద్ర ప్రభుత్వ అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహిళలకు వరం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్

బాలాయపల్లి (సైదాపురం): స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ పథకం మహిళలకు గొప్ప వరమని బాలాయపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వెంకటరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అంబలపూడి గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం స్వస్త్ నారి సశక్త్ పరివార్ పథకం ప్రారంభించారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి పౌష్టికాహార ప్రదర్శన చేశారు.

చికెన్ ధరలు		20-09-2025
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు		
బ్రాయిలర్ లైవ్	:	138
లేయర్ లైవ్	:	110
బ్రాయిలర్ చికెన్	:	246
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	272
లేయర్ చికెన్	:	187

ఏ రోడ్డు చూసినా గుంతలే



బాలాయపల్లి వద్ద చెరువును తలపిస్తున్న రహదారి



బురదగుంటగా మారిన రోడ్డు

సైదాపురం: వెంకటగిరి నియోజకవర్గంలో ఏ ఊరు రోడ్డు చూసినా గుంతలే. వాహనం రోడ్డెక్కితే గంతులేయాల్సిందే.. కూటమి నాయకులు ఎన్నికల ముందు రోడ్లు అద్దంలా మారుస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చాక అధ్వాన్నం చేశారు. ప్రధానంగా సైదాపురం-పొదలకూరు రోడ్డు ఆధునీకరణ పనులకు గత ప్రభుత్వం రూ.43 కోట్ల నిధులను మంజూరు చేసింది. 24 కిలో మీటర్లు పొడవు ఉన్నా ఈ రహదారి పనుల్లో 20శాతం పైగానే పనులను పూర్తి చేశారు. ఈ రహదారి వెంబడి ఉన్న సైదాపురం, ఊటుకూరు, తురిమెర్ల, కలిచేడు గ్రామాల్లో సిమెంట్ రోడ్డు నిర్మాణంతో పాటు మూడు కిలోమీటర్లు బీటీ రోడ్డు పనులను పూర్తి చేశారు. గత 6 నెలల నుంచి ఈ రహదారి పనులన్నీ పూర్తిగా నిలిపివేశారు. ఈ ప్రభుత్వం ఆ నిధులను పూర్తిగా రద్దు చేయడంతో పనులు ఆగిపోయాయి. దీంతో రోడ్లు గుంతలతో నిండిపోయి, బురదగుంటలు దర్శనమిస్తున్నాయి.

వెంకటగిరి-నెల్లూరు రోడ్డు దారుణంగా మారింది. బాలాయపల్లి నుంచి అమ్మపాళెం వరకు ప్రయాణం నరకంగా మారింది. అడుగడుగునా రోడ్లుపై కంకర రాళ్లు లేచిపోవడంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు.

మండల కేంద్రమైన బాలాయపల్లి బస్టాండ్ నుంచి వెంకటగిరికి వెళ్లే రహదారి చెరువులా కనిపిస్తోంది. నిత్యం వందలాది వాహనాలు తిరిగే ఈరోడ్డుపై ప్రయాణించాలంటూ హడలిపోతున్నారు.

కొత్తగా రూ.8 కోట్ల ప్రతిపాదనలు

సైదాపురం-పొదలకూరు రహదారికి గత ప్రభుత్వం రూ.43 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఈ నిధులతో నూతన రహదారి పనులను కాంట్రాక్టర్ చేపట్టారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పనులు కూడా సాగాయి. ఏమైందో ఏమో కానీ ఆ నిధులను నిలిపివేయడంతో కాంట్రాక్టర్ కూడా అర్ధంతరంగా పనులను నిలిపివేశారు. దీంతో రహదారి మరింత దారుణంగా మారింది. మంజూరైన నిధులను రద్దు చేసి నూతనంగా రూ.8 కోట్ల నిధులకు ప్రతిపాదనలు పంపామంటూ ఆర్ అండ్‌బీ అధికారులు తెలిపారు.





పెద్ద పెద్ద గుంతలతో నిండిన సైదాపురం-పొదలకూరు రహదారి, ఊటుకూరు వద్ద ప్రమాదకరంగా ఉన్న రహదారి, కంకర తేలి అధ్వాన్నంగా మారిన వెంకటగిరి తారు రోడ్డు

చెత్త సేకరణ పరిశీలన

దొరవారిసత్రం : మండలంలోని పోలిరెడ్డిపాళెం గ్రామ సచివాలయం పరిధిలోని పలు గ్రామాల్లో చెత్త సేకరణ కార్యక్రమాన్ని స్థానిక ఎంపీడీఓ గోవర్ధన శుక్రవారం తనిఖీ చేశారు. ప్రతి రోజు ఇంటింటికి వెళ్లి చెత్త సేకరించడంతో గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు పంచాయతీ పాలకుల సహకారంతో గ్రామ సచివాలయం సిబ్బంది కృషి చేయాలన్నారు. వీధుల్లో మురుగు నిల్వకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. తాగు నీళ్ల కలుషితం కాకుండా అన్ని విధాలుగా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శకుల సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి మునికృష్ణ, సచివాలయం సిబ్బంది ఉన్నారు.

క్రీడా పోటీల్లో విద్యార్థుల సత్తా



వెంకటగిరి రూరల్: మండల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో పట్టణంలోని రామకృష్ణ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు కరస్పాండెంట్ పి మోహన్‌రావు తెలిపారు. బి హారిక జావలెన్‌త్రోలో రెండో స్థానం, ధనుష్ మూడో స్థానం, యువరాజ్ డిస్కస్‌త్రోలో మొదటి స్థానం, ముని మహేష్, కబడ్డీలో ప్రతిభ కనబరిచారన్నారు. పాఠశాలకు చెందిన ఈశ్వర్, భవిష్, సాయిభవ్య, గ్రేస్ అశ్విన్ నిఖిల, గాయత్రి జోన్‌లెవల్‌కి ఎంపికైనట్లు తెలియజేశారు.

తిరుపతి ఎంపీ గురుమూర్తికి సత్కారం



ఎంపీ గురుమూర్తిని సత్కరిస్తున్న నేతలు

నాయుడుపేటటౌన్: తిరుపతి నియోజకవర్గం పరిధిలోని అనేక సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో శ్రద్ధ చూపుతున్న ఎంపీ మద్దిల గురుమూర్తిని ఆ పార్టీ నాయకులు కలిసి సత్కరించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అర్గనైజింగ్ సెక్రటరి కామిరెడ్డి రాజా రెడ్డి సారథ్యంలో నాయుడుపేటకు చెందిన ఆ పార్టీ నాయకులు శుక్రవారం తిరుపతిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఎంపీకు పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. ఎంపీని కలిసిన వారిలో నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకట కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు చదలవాడ కుమార్, దారా రవి, పాపాడి చంద్రా రెడ్డి, కామిరెడ్డి రాజేష్ రెడ్డి, ఎం మహేష్, పిలాస మణి ఉన్నారు.

పరిహారం కోసం ప్రదక్షిణలు చేస్తున్నాం



వీపీ అగ్రహారంలో నిరసన తెలుపుతున్న సాగరమాల భూనిర్వాసితులు

కోట: సాగరమాల రోడ్డు నిర్మాణానికి భూములిచ్చిన నిర్వాసితులు నష్టపరిహారం కోసం కాళ్లరిగేలా తిరుగుతున్నా అధికారులు న్యాయం చేయడం లేదని వారు తెలిపారు. వీపీ అగ్రహారం గ్రామంలో 15 మంది వరకు భూ నిర్వాసితులకు నష్టపరిహారం అందలేదంటూ శుక్రవారం గ్రామంలో వారు నిరసన తెలిపారు. నెలల తరబడి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగామని వాపోయారు. రోడ్డు పనులు అడ్డుకుని ఆందోళన చేశామన్నారు. అయినా నష్టపరిహారం చెల్లించడంలో జాప్యం చేస్తున్నారన్నారు. అధికారులు వెంటనే స్పందించి వారికి న్యాయం చేయాలని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు నేదురుమల్లి హరీష్‌చంద్రా రెడ్డి డిమాండ్ చేశారు. భూనిర్వాసితులకు పరిహారం చెల్లించని పక్షంలో వారికి అండగా పోరాటం కొనసాగిస్తామన్నారు.

మల్లాంలో 22 నుంచి ఉత్సవాలు

చిట్టమూరు: మండల పరిధిలోని మల్లాం గ్రామంలో కొలువైన శ్రీ కామాక్షీ దేవి సమేత మార్కండేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 22వ తేదీ సోమవారం నుంచి శరన్నవరాత్రుల వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్టీ దువ్వూరు శేషురెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 22న సోమవారం అమ్మవారు లలితాదేవి అలంకారం, 23న బాలాత్రిపుర సుందరి, 24న గాయత్రీదేవి, 25న అన్నపూర్ణాదేవి, 26న కాత్యాయని, 27న మహాలక్ష్మి, 28న కాళికా దేవి, 29న సరస్వతీ దేవి, 30న దుర్గాదేవి, అక్టోబర్ 01, మహిషాషుర మర్దిని, 02న విజయ దశమి రోజున రాజరాజేశ్వరి దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని పేర్కొన్నారు.

షార్‌లో ఘనంగా గురుపూజోత్సవం



సుధా శేషన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న నిర్వాహకులు

సూళ్లూరుపేట: సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్‌లోని ఎంఆర్ కురూప్ ఆడిటోరియంలో శుక్రవారం గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దీనికి చెన్నై ఎంజీఆర్ వైద్య విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్సలర్ సుధా శేషన్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ముందు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్పేస్ సెంట్రల్ స్కూల్స్, కేజీ స్కూల్స్‌కు చెందిన ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథి సుధా శేషన్ మాట్లాడుతూ చిన్నారుల భవిష్యత్తు బాగుపడాలంటే మొదటి తల్లిదండ్రుల తరువాత గురువు ప్రధాన పాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షార్ డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్, కంట్రోలర్ రమేష్‌బాబు, అసోసియేట్ డైరెక్టర్ ముత్తు చెళియన్ తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో ముద్దాయికి రూ.500 జరిమానా

నాయుడుపేట టౌన్: దాడి కేసులో ముద్దాయికి రూ.500 జరిమానా విధిస్తు న్యాయమూర్తి మీనాక్షి సుందరి శుక్రవారం తీర్పు చెప్పారు. పోలీసుల కథనం మేరకు, మండలంలోని గొట్టిప్రోలు గ్రామానికి చెందిన ఆవుల వెంకటయ్యకు అదే గ్రామానికి చెందిన సమీప బంధువు ఆవుల గోపాల్ మధ్య పాత కక్షలు ఉండేవి. గోపాల్‌పై కక్ష కట్టిన వెంకటయ్య 2018 ఫిబ్రవరి 7న గోపాల్‌పై కర్రతో దాడి చేసి గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేశారు. ముద్దాయిపై నేరం రుజువు కావడంతో కోర్టులో వెంకటయ్యకు రూ.500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

కేంద్ర పథకాలు వినియోగించుకోండి

పెళ్లకూరు: మహిళల సాధికారత కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి అన్నారు. దిగువచావలి గ్రామంలో శుక్రవారం స్వస్తినారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ జితేంద్ర, సీహెచ్‌ఓ వెంకటశివారెడ్డి, వైద్య సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

22 నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు

కోట: గ్రామదేవత కోటమ్మ దేవస్థానం, వైష్ణవి దుర్గాదేవి దేవస్థానంలో ఈ నెల 22వ తేదీ నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో శరన్నవరాత్రుల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

కండలేరులో 49.386 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 49.386 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 10,100 క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1150, పిన్నేరుకాలువకు 20, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 100, మొదటిబ్రాంచ్ కాలువకు 15 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

జన సురక్ష బీమా పథకాలపై అవగాహన

వెంకటగిరి రూరల్: రిజర్వ్ బ్యాంకు ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీల్లో జన సురక్ష బీమా పథకాల నమోదుపై విస్తృత అవగాహన కల్పించాలని రిజర్వుడ్ బ్యాంకు ఆఫ్ ఇండియా, జనరల్ మేనేజర్ ఆర్‌కే మహాన పేర్కొన్నారు. పట్టణంలోని నెల్లూరు జిల్లా సహకార బ్యాంకు వెంకటగిరి బ్రాంచిలో సమీక్ష సమావేశం నిర్వహించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌కే మహాన

అల్ట్రాసౌండ్ స్కానింగ్ కోసం గర్భిణుల ఇక్కట్లు




ఆస్పత్రిలో ఉన్న అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్, స్కానింగ్‌కు నమోదు చేయించుకుంటున్న గర్భవతులు

చిల్లకూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పేదలకు వైద్యం అందడం గగనంగా మారింది. దీంతో వైద్యం చేయించుకునేందుకు పేదలు ప్రైవేటు ఆస్పత్రుల వైపు పరుగులు తీయాల్సి వస్తుంది. ఒక వైపు ఆరోగ్యశ్రీని అటకెక్కించడంతో పాటుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆస్పత్రుల్లో కూడా వైద్యం అందించేందుకు సరైన సిబ్బంది లేకపోవడంతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

గూడూరులోని ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిలో రేడియాలజిస్టు అందుబాటులో లేకపోవడంతో గర్భిణులు స్కానింగ్‌కు ప్రైవేటు ఆస్పత్రులకు వెళుతున్నారు. గూడూరు ఏరియా ఆస్పత్రికి డివిజన్ పరిధిలోని పీహెచ్‌సీల నుంచి గర్భిణులను ఆశా కార్యకర్తలు తీసుకొచ్చి వారికి గర్భిణికి పరీక్షలు చేయించి బిడ్డ ఏ స్థితిలో ఉంది. కాన్పు సుఖంగా జరుగుతుందా అనే విషయాలను తెలుసుకుని వైద్యం అందజేస్తారు. ఇందుకు గాను ఆస్పత్రిలో గర్భవతులను పరీక్షించేందుకు అల్ట్రాసౌండ్ స్కానింగ్ మిషన్ వద్ద ఒక రేడియాలజిస్టు ఉండాల్సి ఉంది. గత జూన్‌లో ఆయన శ్రీకాళహస్తి ఆస్పత్రికి బదిలీపై వెళ్లడంతో అప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో ఆస్పత్రిలో పని చేసే గైనకాలజిస్టులే స్కానింగ్ చేస్తున్నారు. ఎవరికైనా గర్భంలోని బిడ్డ అవయవలోపం ఉందని గుర్తించిన వారికి బయట స్కానింగ్ తీయించుకోవాలని చెబుతుందడంతో పేదలు అంత డబ్బు వెచ్చించలేక పోతున్నారు. దీంతో ప్రతి రోజూ వచ్చే గర్భవతులకు పూర్తి స్కానింగ్ చేయలేక అక్కడ వైద్యులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు ఏరియా ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న రేడియాలజిస్టు పోస్టును భర్తీ చేయడం కానీ, వైద్య విద్యలో రేడియాలజీలో పీజీ చేసే వారినైనా కానీ నియమించాల్సి ఉంది. ఈ విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ షరీనాను వివరణ కోరగా ఏరియా ఆస్పత్రిలో ఉన్న రేడియాలజిస్టు జూన్‌లో బదిలీపై వెళ్ళిన మాట వాస్తవమేనన్నారు. అప్పటి నుంచి గైనకాలజిస్టులే గర్భవతులకు స్కానింగ్ చేస్తున్నారని ఏదైనా ఇబ్బంది ఉన్నప్పుడు మాత్రమే బయట స్కానింగ్‌కు సిఫార్సు చేస్తున్నామని తెలిపారు.

చలో మెడికల్ కళాశాలకు తరలిన యువత




తరలిన విద్యార్థి విభాగాల నాయకులు, భూమన అభినయ్‌తో చర్చిస్తున్న యువజన విభాగం నేతలు

నాయుడుపేటౌన్ : వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ ఆదేశాల మేరకు చేపట్టిన చలో మెడికల్ కళాశాల కార్యక్రమానికి సూళ్లూరుపేట నియోజవర్గం నుంచి యువత, విద్యార్థి సంఘాల నాయకులు శుక్రవారం భారీగా తరలి వెళ్లారు. మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య క్యాంపు కార్యాలయం వద్ద నుంచి మదనపల్లి మెడికల్ కాలేజ్ వద్దకు వాహనాల్లో తరలివెళ్లారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగానికి చెందిన పాలేటి నాగార్జున, విష్ణువర్ధన్ రెడ్డి, విద్యార్థి విభాగాల నాయకులు తేజరెడ్డి నారాయణరెడ్డి, యశ్వంత్ పాల్గొన్నారు.

గూడూరురూరల్ : ఛలో మెడికల్ కళాశాలలో భాగంగా జోనల్-4 స్టేట్ యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ భూమన అభినయ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన చలో మదనపల్లె మెడికల్ కళాశాలకు గూడూరు వైఎస్సార్‌సీపీ యువజన నాయకులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఉపాధి పనులు



ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

దక్కిలి: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులు పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీడీఓ రవీంద్ర బాబు తెలిపారు. మండలంలోని సంగనపల్లిలో ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కూలీలకు టీఏలు మార్కింగ్ ఇచ్చి పనులు చేయించాలన్నారు. పనుల్లో అవతవకలు లేకుండా సిబ్బంది చూడాలన్నారు. అనంతరం కూలీల హాజరును పరిశీలించారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ అధికారులు



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న వైద్యులు

సైదాపురం: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తోందని రాపూరు సీడీపీఓ సునంద పేర్కొన్నారు. రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని దాడిశెట్టిపల్లి, మొలకలపూండ్ల అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషకాహారాన్ని ప్రదర్శించారు. సీడీపీఓ మాట్లాడుతూ ఆకుకూరలు, చిరుధాన్యాలు తదితర పోషకాహారాలపై అవగాహన కల్పించారు. పిల్లల్లో స్థూలకాయ నివారణకు చక్కెర, నూనెల వాడకం తగ్గించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ధనమ్మ, ఏఎన్‌ఎం శ్రీలత, ఎంఎల్‌హెచ్‌ఓ వాణి, టీచర్ రవి, కార్యకర్త ధనమ్మ తదితరులున్నారు.

గర్భిణులకు అవగహన

దొరవారిసత్రం: గర్భందాల్చినప్పటి నుంచి పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యమైన బిడ్డకు జన్మనిస్తారని సూళ్లూరుపేట సబ్ డివిజన్ ఐసీడీఎస్ సీడీపీఓ జ్యోతికిరణ్ అన్నారు. శుక్రవారం ఏకొల్లు, నేలపట్టు గ్రామాల్లో పోషణ్ మహా కార్యక్రమంలో భాగంగా బిడ్డ తల్లులకు, గర్భిణులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అంకమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

కలువాయి(సైదాపురం): మండలంలోని కులూరు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కలువాయి పీహెచ్‌సీ పరిధిలోని చిన్న గోపవరంలో డాక్టర్లు అన్వర్‌బాషా, విజయలక్ష్మి, కుల్లూరు సెక్టార్ సూపర్‌వైజర్ రాజేశ్వరి, ఆధ్వర్యంలో శుక్రవారం మహా పోషణ కార్యక్రమం నిర్వహించారు. చిన్న పిల్లలకు బాలింతలకు అందజేసే పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందించారు. కౌంటర్లు ఏర్పాటు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

పిల్లలకు పోషకాహారం తప్పనిసరి

వెంకటగిరి రూరల్: పిల్లల విషయంలో తల్లిదండ్రులు కీలకంగా వ్యవహరించాలని ఐసీడీఎస్ సీడీపీఓ శంషాద్‌బేగం పేర్కొన్నారు. మండలంలోని జంగాలపల్లి సచివాలయం వద్ద శుక్రవారం పోషణ మాసోత్సవం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పిల్లల పెంపకంలో తల్లిదండ్రులు వీలైనంత శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం మహిళలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు.

పురుషుల భాగస్వామ్యం

గూడూరురూరల్ : పోషణ సంరక్షణలో పురుషుల భాగస్వామ్యం ఎంతో అవసరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజన పేర్కొన్నారు. 8వ రాష్ట్రీయ పోషణ మాసంలో భాగంగా పట్టణంలోని అశోక్‌నగర్ సెక్టార్ పరిధిలో ఉన్న నమాజ్‌కట్ట, పి.ఎస్.ఆర్. పార్కు అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, తల్లులకు పోషణ సంరక్షణలో పురుషుల భాగస్వామ్యంపై అవగాహన కల్పించారు. గాంధీనగర్ సెక్టార్ పరిధిలో ఉన్న కొండాగుంటలో పోషణ మాసం నిర్వహించారు. బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని ఏసీడీపీఓ శారదాంబ సూచించారు.

సైదాపురంలో వర్షం

సైదాపురం: గత రెండు, మూడు రోజులుగా ఎండలు మండిపోవడంతో ప్రజలు ఇళ్లల్లోనుంచి బయటకు వచ్చేందుకు ఇబ్బందులు పడ్డారు. తీవ్ర ఉక్కపోతకు గురై అవస్థలు పడ్డారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్నం నుంచి భారీ వర్షం కురవడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లపడింది. దీంతో ప్రజలు ఉపశమనం పొందారు. వర్షం నిమ్మ రైతులకు ఊరట లభించింది.

